హైడ్రా తెచ్చిన తంటా..!

జూపార్కు ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంపై రాజకీయ రంగు

- ఇప్పటికే నాలుగు పర్యాయాలు వాయిదా
- ఎంఐఎం, కాంగ్రెస్ మధ్య గ్యాప్ కారణమని ప్రచారం
- ఎంపీ అసదుద్దీన్ అందుబాటులో లేకనే పోస్ట్‌పోన్ చేస్తున్నారన్న వాదన
- ప్రభుత్వ తీరుపై జీహెచ్ఎంసీలో ఆసక్తికర చర్చ

సిటీబ్యూరో, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి రావాల్సిన జూపార్కు-ఆరాంఘర్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంపై రాజకీయ రంగు అలుముకున్నది. అధికార పార్టీ కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల మధ్య నెలకొన్న గ్యాప్‌తో ఈ ఫ్లై ఓవర్ వాహనదారులకు అందుబాటులోకి రావడం లేదన్న చర్చ అటు జీహెచ్ఎంసీ అధికార వర్గాలు, ఇటు పాలక మండల సభ్యుల్లో చర్చ ఆసక్తికర చర్చ జరుగుతున్నది. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్ఆర్‌డీపీ)లో భాగంగా రూ. 629.30కోట్లతో అరాంఘర్ నుంచి జూపార్క్ వరకు ఆరు లేన్లతో119 పిల్లర్లతో 4.08 కిలోమీటర్ల మేర చేపట్టిన భారీ ఫ్లైఓవర్ నిర్మాణం పనులు పూర్తి చేసుకోగా, ప్రారంభం విషయంలో తరచూ వాయిదాల పర్వాన్ని కొనసాగిస్తుండడమే ఇందుకు నిదర్శనమని చెప్పొచ్చు. వాస్తవంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజాపాలన-ప్రజా విజయోత్సవ సంబరాల్లో పురపాలికకు సంబంధించిన ఈ నెల 3న పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరపాలని నిర్ణయించి కొన్నింటిని ప్రారంభించారు. అయితే షెడ్యూల్ ప్రకారం వర్చువల్ విధానంలో జూపార్కు-ఆరాంఘర్ ఫ్లైఓవర్ ప్రారంభం ఉందని, ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. కానీ ఆ రోజు కుదరలేదని చెబుతూ వాయిదా వేశారు. ఆ తర్వాత 5వ తేదీ, 8వ తేదీ అంటూ వాయిదా వేస్తూ వచ్చారు. చివరకు 9న ఫ్లైఓవర్‌ను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేస్తామని సర్కారు ప్రకటించింది. కానీ నాలుగు దఫాలుగా వాయిదా వేస్తూ వచ్చిన అధికారులు ఇప్పటి వరకు ఈ ఫ్లైఓవర్ ఎప్పుడు ప్రారంభిస్తారో వెల్లడించలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారు. సీఎంవో ఆదేశాలు వస్తేనే ఈ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం ఉంటుందని సంబంధిత ఇంజినీర్లు చెబుతుండడం గమనార్హం.

ఎంఐఎం, కాంగ్రెస్ మధ్య గ్యాప్ కారణం?

కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల ప్రజాప్రతినిధుల మధ్య అభిప్రాయ భేదాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఇందుకు ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన హైడ్రా తీరు ఇందుకు ఆజ్యం పోసినట్లు పాలకమండలి సభ్యుల్లో చర్చ జరుగుతున్నది. ఉద్ధౌలా చెరువు సమీపంలో ఎంఐఎం పార్టీ నేతలకు సంబంధించిన భవనాలను కూల్చివేయడం, సల్కం చెరువులోని నిర్మాణాలు, ఎంపీ అసదుద్దీన్‌కు సంబందించిన విద్యా సంస్థలపై హైడ్రా వ్యవహరించిన తీరుపై అసదుద్దీన్ గుర్రుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, సీఎం రేవంత్‌రెడ్డిల మధ్య దూరం పెరిగిందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. హైడ్రా ఏర్పాటుపై జీహెచ్ఎంసీ పాలకమండలిలో ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లు మేయర్‌ను కలిసి వ్యతిరేకిస్తూ పలు దఫాలుగా వినతిపత్రాలు సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. దీనికి తోడు ఇటీవల చాదర్‌ఘట్ సమీపంలోని చికెన్ మార్కెట్ వ్యవహారంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వర్సెస్ ఎంఐఎం పార్టీ ఎమ్మెల్సీ బేగ్ మధ్య తారాస్థాయిలో విభేదాలు చోటు చేసుకున్నాయి. ఈ వరుస సంఘటనల నేపథ్యంలోనే ఆరాంఘర్-జూపార్కు ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంపై తీవ్ర ప్రభావం పడుతుందన్న చర్చ జరుగుతున్నది. ప్రొటోకాల్ ప్రకారం ఎంపీ అసదుద్దీన్ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుంది. అయితే జీహెచ్ఎంసీ అధికారుల ఆహ్వానానికి అట్నుంచి సరైన సమాధానం రాకపోవడం, ఇదే విషయాన్ని ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. మొత్తంగా కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల మధ్య గ్యాప్ పెరగడం, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహారంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక పార్టీ కోసం ప్రారంభోత్సవాన్ని ఇంకా ఎన్ని సార్లు వాయిదా వేస్తారంటూ ప్రశ్నిస్తున్నారు.

పాతనగరానికి మహా రిలీఫ్

ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో చిత్తశుద్ధితో వ్యవహరించాల్సిన సిగ్నల్ రహిత, మెరుగైన రవాణా వ్యవస్థను పటిష్టం చేయడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ (ఎస్ఆర్‌డీ) కార్యక్రమం ద్వారా విడతల వారీగా ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తున్నాయి. బైరామల్ గూడ ఫ్లై ఓవర్లు, లూప్‌లను ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వం జూపార్కు-అరాంఘర్ ఫ్లై ఓవర్ విషయంలో తాత్సరం చేస్తూ వస్తుండడం చర్చనీయాంశంగా మారింది. పాతనగరంలో ఇప్పటికే పలు ఫ్లై ఓవర్లు అందుబాటులోకి వచ్చి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికింది. ఓవైసీ ఫ్లై ఓవర్, అబ్దుల్ కలాం ఫ్లై ఓవర్, చాంద్రాయణ గుట్ట ఫ్లై ఓవర్ అందుబాటులోకి తీసుకురాగా..ఆరాంఘర్-జూపార్కు ఫ్లై ఓవర్‌తో శంషాబాద్ విమానాశ్రయం వరకు ప్రయాణం సాఫీగా సాగనుంది. నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు రవాణా మెరుగుపరచడమే కాకుండా సిగ్నల్ ఫ్రీ రవాణా వ్యవస్థకు దోహదపడనుంది. వీలైనంత త్వరగా ఈ ఫ్లై ఓవర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

నేటి నుంచి పశువైద్య జాతీయ సదస్సు

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 16 : మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సులో పశువైద్యంపై సుదీర్ఘ చర్చ జరుగనుంది. పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నిర్వహించే ఈ సదసు ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరుగనుంది.33వ నేషనల్ కాంగ్రెస్ నేషనల్ సింపోజియం ఆఫ్ పారాసిటాలజీ అనే అంశంపై సుదీర్ఘ చర్చ జరుగనుంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి శాస్త్రవేత్తలు పాల్గొననున్నారు. జంతు, పరాన్నజీవుల నియంత్రణ, వ్యూహాల్లో చేసిన మార్పులు, నూతన ఆవిష్కరణలు జరుగనున్నాయని రిజిస్ట్రార్ డా.శరత్ చంద్ర తెలిపారు. జంతు, మానవ ఆరోగ్యం, పరాన్నజీవుల నియంత్రణ, కొత్త మార్పులు తదితర అంశాలపై చర్చ జరుగనుందన్నారు. నిపుణులకు శాస్త్రీయ గోష్ఠి ఒక వేదిక కానుందన్నారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనతి కాలంలోనే వ్యవసాయంతో పాటు , గొర్రెల మేకల పెంపకం, పశుపోషణ, ఫిషరీస్‌ను ప్రోత్సహించారన్నారు.

అక్రమ అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరు

మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు

మంచాల, డిసెంబర్ 16 : అసెంబ్లీ ముట్టడికి ఎలాంటి పిలుపును ఇవ్వకున్నా సోమవారం సర్పంచ్‌లను ముందస్తుగా అక్రమంగా అరెస్ట్ చేయించి పోలీస్‌స్టేషన్‌లో ఉంచడం సిగ్గుచేటని మాజీ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బొడ్డు నాగరాజుగౌడ్ అన్నారు. మంచాల మండలం 23 గ్రామపంచాయతీల్లో సుమారు రూ.3కోట్ల వరకు సర్పంచ్‌లకు బిల్లులు రావాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోగా అరెస్ట్‌లు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసిన వాటికి బిల్లులు ఇవ్వాలని అడిగితే.. పోలీసులతో అరెస్ట్ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు జగన్‌రెడ్డి, బాల్‌రాజ్, రఘు, అనిత తదితరులున్నారు.

సర్వేకు సహకరించాలి

ఆమనగల్లు, డిసెంబర్ 16 : ఆమనగల్లు మున్సిపాలిటీలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు దరఖాస్తుదారులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నర్ర వసంత పేర్కొన్నారు. సర్వేలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్టతండాలో సర్వే జరుగుతున్న తీరును ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

నుచ్చుగుట్టతండాలో ఇందిరమ్మ దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కమిషనర్ వసంత

మద్దూర్‌లో పశువులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

పశువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్, డిసెంబర్ 16 : పశువుల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని మద్దూర్ గ్రామంలో పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. పాడి పరిశ్రమను పోషించుకుని జీవనం సాగించే రైతులకు మంచి లాభాలు ఉంటాయని తెలిపారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో పశువైద్యశిబిరాలు నిర్వహించి వైద్యపరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. మద్దూర్‌లో 150 వరకు పశువులకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశామన్నారు.

లచ్చిరెడ్డికి ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డు

ఢిల్లీలో ఏపీజే అబుల్ కలాం జాతీయ అవార్డును అందుకుంటున్న లచ్చిరెడ్డి

మంచాల, డిసెంబర్ 16 : మంచాల మండలం తాళ్లపల్లిగూడ గ్రామానికి చెందిన గోగిరెడ్డి లచ్చిరెడ్డికు జనసందేశ్ ఫౌండేషన్ ద్వారా ఇబ్రహీంపట్నం నియోజక వర్గంలోని వివిధ గ్రామాల్లో చేసిన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఢిల్లీలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ ద్వారా ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ అవార్డును జాతీయ అధ్యక్షుడు నాళ్ల రాధాకృష్ణ సోమవారం అవార్డును అందజేశా. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. తాను చేసిన సేవలకు గుర్తింపుగా తనకు అవార్డు అందజేసినందుకు రాబోయే రోజుల్లో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ సభ్యుడు ప్రతాప్ ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 16 : లగచర్ల రైతులపై అక్రమ కేసులు పెట్టి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లల్లో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణచివేత విధానాలకు నిరసనగా.. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 10:30 గంటలకు నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన అనంతర నిరసన కార్యక్రమం నిర్వహించనున్నందున నియోజకవర్గంలోని బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్‌వై నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తాబేలు.. భలే బాగు.. జంక్షన్ల సుందరీకరణలో భాగంగా నాగార్జున సర్కిల్ -కేబీఆర్ పార్క్ రోడ్‌లో ఏర్పాటు చేసిన తాబేలు ఆకృతి

షాబాద్‌లో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ కాంతారెడ్డి

రెండిండ్లలో చోరీ

8 తులాల బంగారం, 4 కిలోల వెండి, రూ.7 లక్షలు అపహరణ

షాబాద్, డిసెంబర్ 16 : వేర్వేరు ఇండ్లలో చోరీలు జరిగిన ఘటనలు షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగాయి. షాబాద్ సీఐ కాంతారెడ్డి కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి షాబాద్‌కు చెందిన సుధీర్ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గమనించిన దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న తులం బంగారం, 4 కిలోల వెండి అపహరించారు. అదే కాలనీలో రవూఫ్ తన కుమారుడి పెళ్లి చేసేందుకు బంగారు ఆభరణాలు, నగదు ఇంట్లో పెట్టి బట్టలు కొనేందుకు హైదరాబాద్ వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 7 తులాల బంగారం, రూ.7 లక్షలను ఎత్తుకెళ్లారు. అలాగే షాబాద్‌కు చెందిన యాదగిరి టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్రవాహనాన్ని దొంగిలించారు. క్లూస్ టీంతో దుండగుల ఆధారాలను సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

పార్టీలకు అతీతంగా అభివృద్ధి

ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, డిసెంబర్ 16 : కాలనీల్లో అభివృద్ధి పనులను పార్టీలకు అతీతంగా చేపడుతామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్ భవాని నగర్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూసీ అభివృద్ధి, ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని, మూసీ అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇండ్లను కూలుస్తామంటే మాత్రం తాము ఊరుకునేది లేదన్నారు. మూసీ బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. భవానినగర్ కాలనీవాసుల అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తామన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న వెంకటేశ్, దశరథ్‌నాయక్, ఆనంద్, వైద్యులు

కడ్తాల్, డిసెంబర్ 16 : సమాజ సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అన్నాస్‌పల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, రాధాకృష్ణ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో, కామినేని దవాఖాన వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందించడానికే ట్రస్ట్ తరుపున హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని వెంకటేశ్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఉప్పల ట్రస్ట్ సేవలను నియోజకవర్గంలో మరింత విస్తృతపరుస్తామన్నారు. శిబిరంలో 255 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యుడు అఖిల్ తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, పీఏసీఎస్ డైరెక్టర్ వీరయ్య, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు మహేశ్‌యాదవ్, నాయకులు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల మండల పరిధి రావులపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కేసారం శ్రీనివాస్‌కు ఇటీవల బహుజన సాహిత్య అకాడమీ ఇంటర్నేనల్ అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. ఆదివారం రాత్రి ఢిల్లీలోని తెలుగు అసోసియేషన్ ఆడిటోరియంలో నిర్వాహకులు 27 రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, సభ్యులకు అవార్డులు అందించారు. ఇందులో భాగంగా శ్రీనివాస్ కూడా అవార్డు అందుకున్నారు. - చేవెళ్ల రూరల్, డిసెంబర్ 16

చర్చి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

కడ్తాల్, డిసెంబర్ 16 : మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా చర్చిని నిర్వహిస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సోమవారం బీజేపీ నాయకులు రవీందర్‌రెడ్డి, భగీరథ్‌జీ, కుమార్, అంజయ్య కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కడ్తాల్‌లో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా చర్చిని నిర్వహిస్తున్నారని తెలిపారు. పెద్ద సౌండ్స్‌తో కాలనీవాసులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, ఇదేమిటని అడిగితే గొడవలకు దిగుతున్నారని పేర్కొన్నారు. కాలనీలో అడ్డదిడ్డంగా వాహనాలను నిలిపి ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. చిన్నారులకు చాక్లెట్లు, బిస్కెట్లు అందించి వారిచే ఏసు గీతాలను పాడిస్తూ, డ్యాన్సులు చేయిస్తున్నారని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడినవారిని ఎంచుకొని మత మార్పిడులకు ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. మతమార్పిడులపై ఎవరైనా ప్రశ్నిస్తే ఎదురు తిరుగుతున్నారని వివరించారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న చర్చిని తొలగించి, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బిల్లులు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

కడ్తాల్, డిసెంబర్ 16 : సర్పంచ్‌ల సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిన మాజీ ఆర్థిక శాఖ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం తరపున రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్ కృతజ్ఞతలు తెలిపారు. కరోనాలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతిలో పట్టుకొని ప్రజలకు సేవలందించడం గొప్ప విషయమని, ఎంతో కష్టపడి తెలంగాణ పల్లెలను అన్ని విధాల అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దడంలో సర్పంచ్‌లు కీలకపాత్ర వహించినట్లు హరీశ్‌రావు అసెంబ్లీలో ప్రస్తావించారని లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా తెలంగాణ గ్రామాలకు మంచి పేరు తెచ్చిన సర్పంచ్‌ల బిల్లులను పెండింగ్‌లో పెట్టడమేంటని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీశారన్నారు. బిల్లులు చెల్లించాలని సర్పంచ్‌లు నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తే, ఎక్కడికక్కడ నిర్బంధించారని విమర్శించారు. బిల్లులు రాక సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ప్రభుత్వం మేల్కొని బిల్లులను విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని లక్ష్మీనర్సింహారెడ్డి హెచ్చరించారు.

రంగారెడ్డి జిల్లా సీపీఎం 10వ మహాసభలు ఈ నెల 28, 29 తేదీల్లో ఇబ్రహీంపట్నంలో నిర్వహిస్తున్నందున వాటిని విజయవంతం చేయాల్సిన బాధ్యత సీపీఎం కార్యకర్తలపై ఉందని మండల కార్యదర్శి రావుల జంగయ్య అన్నారు. సోమవారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో సీపీఎం జిల్లా మహాసభల కోసం ఇంటింటికీ తిరుగుతూ విరాళాలు సేకరించారు.
- మంచాల, డిసెంబర్ 16